క్లుప్తంగా

దుర్గమాంబ.. చల్లగ చూడమ్మా



అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన పిండి వంటలు

అక్కిరెడ్డిపాలెం: దుర్గ మాంబ అమ్మవారి 13వ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు, సత్యవతి దంపతులు ఆధ్వర్యంలో సారె ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, దాడి వెంకటరమేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



తయారు చేసిన వస్తువులతో విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును పెడుతున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో మంగళవారం కథలు పుస్తకాలు చదివించారు. అలాగే వారితో వివిధ కళాకృతులను తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు విశ్వక్సేన పూజలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం దివ్యక్షేత్రంలో శ్రీవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజతో పాటు పుణ్యాహవచనం, అజస్రదీపారాధన, మేదిని పూజ, అంకురార్పణం, వాస్తు పూజ, వాస్తు హోమం, పూర్ణా హుతి అనంతరం తీర్థ ప్రసాదవితరణ గావించారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం



పౌష్టికాహారం అందిస్తున్న ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు

అగనంపూడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని నాయకుడు ఇల్లపు ప్రసాద్ అన్నారు. పినమడక పునరావాసకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కడవల రమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోనో యాక్షన్



యాక్షన్ చేస్తున్న చిన్నారులు

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం చిన్నారులు ప్రదర్శించిన మోనో యాక్షన్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.చంద్రకళ చిన్నారులను అభినందించారు. అనంతరం ఆమె రాణీగారి హారం కథను చిన్నారులకు వివరించారు.

భూ చోళ్లు



తాజాగా ఉక్కు స్థలంలో జరిగిన నిర్మాణం



పిల్లర్లు వేసి అమ్మకానికి పెట్టిన ఉక్కు స్థలం

- కబ్జాకు గురవుతున్న ఉక్కు స్థలాలు
- నకిలీ పత్రాలు సృష్టించి అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- కోట్లకు పడగలెత్తుతున్న దళారులు

వడ్లపూడి ఆర్‌హెచ్.కాలనీలో తాజాగా కోట్లు విలువచేసే మూడు ప్లాట్‌లను సొంతం చేసుకోవడానికి అక్రమార్కులు స్కెచ్ వేశారు. ఆ ప్రక్రియ ప్రారంభించి అనతికాలంలోనే పూర్తి చేసేశారు. ఆ స్థలాలను అధికారికంగా చేతులు మార్చి అవి పూర్వీకుల నుంచి వచ్చినట్టు పత్రాలు చూపిస్తున్నారు.

ఒకే దగ్గర మూడు ప్లాట్లు సాధ్యమేనా!

ఆయన పేరిట ఆ స్థలాలు రిజిస్ట్రేషన్ చేసిన వారికి ఎలా వచ్చాయో అన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక వేళ బంధువుల ద్వారా వస్తే ఒకే దగ్గర వరుసుగా 3 ప్లాట్‌లు కేటాయిస్తారా అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న స్థలాలు.. వాటి ప్లాట్ నెంబర్లు రికార్డుల్లో వెతికితే అవి వేరే ప్రాంతంలో ఉన్నట్లుగా అధికార వర్గాలే పేర్కొంటున్నాయి. అలాంటి అప్పుడు ఆ స్థలాలు చేజిక్కించుకోవడానికి దళారులతోపాటు అధికారులు చేతులు కలుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడమే వరం

విశాఖ ఉక్కు భూసేకరణ విభాగానికి చెందిన కొంతమంది సిబ్బంది ఎక్కడెక్కడ ఏఏ స్థలాలు ఖాళీగా ఉన్నాయన్న సమాచారం దళారులకు చేరవేయడంతో వారు రంగంలోకి దిగి అన్నీ సర్దేస్తున్నారు. ఆ తర్వాత అమ్మకాలు జరిపి సహాయం చేసిన ప్రతి ఒక్కరికి వారి వాటాలు వారికి పంపుతున్నారు. దీని వల్ల అసలైన నిర్వాసితులు అన్యాయమైపోగా.. కబ్జాకోరులు కారుల్లో షికారు చేస్తున్నారు. ఇలా ఉక్కు స్థలాలకు స్కెచ్ వేసి తమ చేతుల్లోకి తీసుకుని విక్రయించడం ద్వారా కోట్లు ఆర్జిస్తున్నారు.

> స్టీల్‌ప్లాంట్ స్థలాలు కబ్జా రాయుళ్ల హస్తగతమవుతున్నాయి. ఆ తర్వాత చేతులు మారుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీన్ని అదునుగా చేసుకుని వడ్లపూడి నిర్వాసిత కాలనీలో కనబడిన ఖాళీ స్థలం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. అప్పటికప్పుడు నకిలీపత్రాలు సృష్టించి అమ్మకాలు చేస్తున్నారు. అంతటితో ఆగిపోకుండా రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టి ఎంచక్కా సొంతం చేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమార్కులు బెదిరిస్తున్నారు.
>
> \- కూర్మన్నపాలెం

మౌనం వహిస్తున్న ఉక్కు అధికారులు

అయితే ఉక్కు భూసేకరణ అధికారులు కబ్జాలను అడ్డుకోకపోయినా ఆయా స్థలాలు ఎవరికీ కేటాయించలేదని మాత్రం ధ్రువీకరిస్తున్నారు. అయినప్పటికీ కబ్జాకోరులు,దళారులు ఎక్కడా తగ్గకుండా అదేపనిలో నిమగ్నమై ఉన్నారు. ఇందులో ఒక పదవీ విరమణ పొందిన చిన్నస్థాయి పోలీసు అధికారి ఒకరు ప్రధాన పాత్రధారిగా వ్యవహరిస్తుండగా.. కొందరు సూత్రదారులు భేరసారాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆ అధికారికి అత్తవారు, ఇతర బంధువుల ద్వారా ప్లాట్లు సక్రమించినట్టు పత్రాలు సృష్టించారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కూర్మన్నపాలెం వేదికగా నకిలీ పత్రాలు

ఈ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టి కూర్మన్నపాలెం వేదికగా సాగుతోంది. ఓ ఘనాపాటీకి రెండు కంప్యూటర్ సెంటర్లు సహకరిస్తుండడంతో పని సులువుగా అవుతుంది. స్థలం ఎక్కడో అది ఎప్పటి నుంచి ఖాళీగా ఉందో.. ఇంతకు ముందు ఎవరి కేటాయించి రద్దు చేశారో.. భూసేకరణ విభాగం నుంచే ఎప్పటికప్పుడు దళారులకు చేరిపోతుంది. దీంతో కబ్జాకు అనుకూలంగా రికార్డులు చేయడం.. ఆతర్వాత నిర్మాణాలు చేపట్టి సొంత చేసుకోవటం.. మరి కొన్ని అమ్మకాలు సాగించడం పరిపాటిగా మారిపోయింది. ఆ తతంగం అంతా ఉక్కు భూసేకరణ సిబ్బందికి తెలిసినా.. వాటాలు అందడంతో పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ అధికారికి కారు కేటాయించిన వడ్లపూడికి చెందిన వ్యక్తే మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఆక్రమణలపై ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం ఆ ప్రచారానికి బలం చేకూరుతుంది.



కబ్జాకోరుల హస్తగతమైన స్థలంలో ఇదొకటి

పాఠ్య పుస్తకాలు వచ్చాయ్



పుస్తకాలు, ఇతర సామగ్రి పరిశీలిస్తున్న ఎంఈవో రమణాజీ తదితరులు

పెదగంట్యాడ: పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలని విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. పెదగంట్యాడ మండల పరిధిలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 3854 మంది విద్యార్థులు విద్యరభ్యసిస్తున్నారు. ఈ మేరకు మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ)కి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్ వచ్చాయి.వీటిలో నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు ఉన్నాయి. అయితే ఇంకా పిల్లల బూట్లు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వచ్చిన సామగ్రిని పాఠశాలల వారీగా విభజించి బడులు తెరవడానికి ముందుగానే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ తెలిపారు.

6న పంచాయతన దేవాలయ వార్షికోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 6న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వర్లు, చిట్టూరి వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు వార్షికోత్సవ పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం అమ్మవారికి గణపతి పూజ, శాంతి కల్యాణం తదితర పూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పచ్చిగోళ్ల గోపి, నంబూరు సత్యనారాయణ, రామారావు, వెంకటేశ్వరరావు, నానాజీపాల్గొన్నారు.

ఏడాదిగా ప్రజలకు వెన్నుపోటు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిప్పల నాగిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

- కూటమి సర్కారు మోసాన్ని బహిర్గతం చేద్దాం
- నేటి వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఏ వర్గానికీ న్యాయం చేయలేదని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వాంబేకాలనీలో 65వ వార్డు వైఎస్సార్‌సీపీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్నివర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, అరెస్టులతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కాలం వెళ్లదీస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ధర్మాల శ్రీనివాసరావు, నాగిశెట్టి శ్రీను, మద్దాల అప్పారావు, పిట్టా ప్రకాష్‌రెడ్డి, లోకనాథం, గోన శ్రీను, పుష్ప, రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు వెన్నుపోటు దినం ర్యాలీ

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పాత గాజువాక జంక్షన్ గాజువాక మండల తహసీల్దార్ కార్యాలయం వరకూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగాల సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కు నగరంలోని సీ భవన్‌లో తెలంగాణ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను ప్రాంభించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 1200 మంది బలిదానం చేశారన్నారు. సంఘం ప్రధానకార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ ఉక్కునగరంలో ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారిని స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. సీఐ దాలిబాబు మాట్లాడుతూ అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. భూక్యా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, ప్రతినిధులు జి.మల్లేశం, టి.ప్రభాకర్, ఎన్.నర్సింగరావు, జె.శ్రవణ్‌కుమార్, చంద్రకిరణ్, చంద్రమౌళి, సి.సంయుక్త కార్యదర్శి ఆర్.నరసింహా పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ యూనిట్ సభ్యులు పాల్గొని దొడ్డి కొమురయ్య పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ డైరెక్టర్ ఎం.సేనాపతి, తుక్కలపల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

'పవర్ గ్రిడ్' అభివృద్ధికి యువ ఇంజినీర్లు కీలకం

పరవాడ: పవర్ గ్రిడ్ అభివృద్ధికి యువ ఇంజినీర్లు దోహదపడాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(పీజీసీఐఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్ నవీన్ శ్రీవాస్తవ్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని హెచ్‌వీడీసీ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రానున్న రోజుల్లో పవర్ గ్రిడ్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త గ్రిడ్ కోసం రూ.3 వేల కోట్లను ఖర్చు చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. పవర్ గ్రిడ్‌లో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్ అత్యంత విలువైన ఆవిష్కరణగా అభివర్ణించారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ సంతోష్ మాట్లాడుతూ మానవ జోక్యం లేకుండా లోపల ఏ విధమైన ప్రమాదం జరిగినా ఈ రోబోట్ గ్రహిస్తుందన్నారు. సాంకేతిక సమాచారం కూడా తెలియజేస్తుందని పేర్కొన్నారు.

బస్టాప్ ఒక చోట...ఆపేది మరోచోట

- దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద అక్కరకురాని సిటీ బస్సులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద ప్రతి పది నిమిషాలు, పావుగంటకు సిటీ బస్ సౌకర్యం ఉన్నా ప్రయోజనం లేకుండా పోతుంది. సిబ్బంది తీరుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నాలుగో ప్లాట్‌ఫారం వైపు సింహాచలం నుంచి చోడవరం వెళ్లే బస్సులు బస్టాప్ వద్ద ఆపుతున్నా, వివిధ ప్రాంతాల నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే సిటీ బస్సులు మాత్రం స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో నిలుపుతున్నారు. కొంతమంది సిబ్బంది ఫ్లైఓవర్ వంతెన వద్ద నిలిపేస్తుంటే.. మరికొంత మంది నాగదేవత కొండ వద్ద ఆపుతున్నారు. రైల్లో ప్రయాణికులు దిగి బస్టాప్‌కు వచ్చేసరికి బస్‌లు దూరంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది బస్ నిలిపిన చోటకు వెళ్లి బస్ ఎక్కుతుంటే బస్టాప్‌కు వస్తాం ఎక్కొద్దని వారిస్తుండడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తీరు చూస్తుంటే ఆటోడ్రైవర్లకు సహకరించేలా ఉందని, బస్‌లు నిలపడానికి బస్టాప్ వద్ద స్థలం ఉన్నా దూర ప్రాంతంలో నిలపడం, ప్రయాణికులు ఆటోల్లో వెళ్లిన తర్వాత బస్టాప్‌కు రావడంలో ఆంతర్యం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా రవాణా సంస్థ అధికారులు స్పందించి బస్టాప్ వద్ద బస్‌లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



దువ్వాడ ఫ్లైఓవర్ వంతెన వద్ద సిటీ బస్



దువ్వాడ నాగదేవత కొండ వద్ద సిటీ బస్

జోరుగా.. హుషారుగా...



రైల్వే ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న సీనియర్ సిటిజన్లు

అగనంపూడి: రైల్వే ప్రయాణికులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీలో మంగళం సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. 300 మినరల్ వాటర్ బాటిళ్లను ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని సాధారణ, మహిళా, దివ్యాంగుల బోగీల్లోని ప్రయాణికులకు అందించారు. ఇప్పటి వరకూ 8500 బాటిళ్లను అందించినట్టు కార్యక్రమ నిర్వాహకులు కె.ఈశ్వర్, ఎంఎస్ఎన్‌మూర్తి తెలిపారు. మంగళవారం వాటర్‌బాటిళ్లను డి.వై.నాయుడు, పి.గోవిందరావు సహకారంతో అందించారు. కార్యక్రమంలో గుదే సుశీలా గజేంద్రరావు, బోసుబాబు, ఎస్ఎం రఫీ, జాషువా, పి.శ్రీనివాస్, ఆదిల్ రెహ్మాన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యోగా సాధనతో బహుళ ప్రయోజనాలు



యోగా సాధన చేస్తున్న స్థానికులు

గాజువాక: యోగా సాధన వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం 70వ వార్డు శ్రామికనగర్‌లో ఏర్పాటు చేసిన యోగా సాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ వస్తున్నారని, ఇది సంతోషించదగ్గ విషయమని అన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో మన యోగాను నమోదు చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాలిమేర శ్రీనివాసరావు, దీనంకొండ పావని, సంతోష్ కుమార్ రాజు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, ములకలపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అక్కిరెడ్డిపాలెం: ఇందిరాకాలనీ కొత్తగాజువాకకు చెందిన లావేటి వసంత (20)గత నెల 23న ఇంటి నుంచి వెళ్లి పోయినట్లు తల్లి లావేటి లక్ష్మి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలు అనే వ్యక్తితో వెళ్లి పోయిందని యువతి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువతి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువతి చామన ఛాయగా ఉంటుందని, ఇంటి నుంచి వెళ్లే సమయంలో బ్లాక్ టాప్, బ్లూజీన్స్ ధరించి ఉందని, ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిపిన వారు. గాజువాక సీఐ 9440796014, పోలీస్‌స్టేషన్ నంబర్లకు7386013112, 9441046802 తెలపాలన్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్‌లు యువతకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ శిక్షణను అందిస్తున్నాయి. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు కంచరపాలెం నందు గల ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పి. నరసింహారావు (79015 23209), ఎం. నాగ త్రినాథ్ (98855 07887) నంబర్లలో సంప్రదించవచ్చు.